సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం, 8, సెప్టెంబర్, 2023



తెరిపిచ్చిన వర్షం

నగరంలో వర్షం తెరిపిచ్చింది. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు వర్షం పడింది. IIలో



కళా ఉత్సవం అదిరెన్

కేంద్రీయ విద్యాలయం-2 శ్రీవిజయనగర్‌లో రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. IIలో

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం శ్రీకారం చుట్టారు. IIలో

న్యూస్‌రీల్

వచ్చే నెల 1న శతాబ్ది హాఫ్ మారథాన్



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబర్ ఒకటో తేదీన శతాబ్ది హాఫ్ మారథాన్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు గురువారం ఆవిష్కరించారు. ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి ఆ రోజు ఉదయం 3 కి.మీ, 5 కి.మీ, 10 కి.మీ శతాబ్ది హాఫ్ మారథాన్ ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, వైద్యులు గోపాలరావు, సిహెచ్‌ఆర్‌వీఎన్ భూషణ్‌రావు, జి.శ్వేతారావు, ఎంఎస్ఎన్ పాత్రుడు, ఎ.హర్షిత, విజీఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'నీతోడు' ట్రాన్స్‌జెండర్స్ పొదుపు సంఘం ఏర్పాటు

రాష్ట్రంలోనే తొలి సంఘంగా గుర్తింపు



పొదుపు సంఘం సభ్యులతో సిస్టర్ అమిత

మురళీనగర్: నీతోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ సభ్యులుగా గురువారం పొదుపు సంఘం ఏర్పాటైంది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమిత ఆధ్వర్యంలో మురళీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆసక్తి ఉన్న ట్రాన్స్‌జెండర్లతో ఈ పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ల పొదుపు సంఘం ఇదేనని, ఇందులో 10 మంది సభ్యులు చేరినట్లు ఆమె తెలిపారు. వీరి పేర్లతో మురళీనగర్ స్టేట్ బ్యాంక్ శాఖలో ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.మల్లికార్జునరావు, డిప్యూటీ బ్రాంచి మేనేజర్ హిమబిందు పాల్గొన్నారు.

9న జాతీయ సమాచార కమిషనర్ల సమాఖ్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్స్ ఆఫ్ ఇండియా(ఎన్ఎఫ్ఐసీఐ) జాతీయ సదస్సు విశాఖ నగరంలో జరగనుంది. ఈ నెల 9న జరగబోయే 28వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, 12వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా కేంద్ర సమాచార కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వైకే సిన్హా, సీఐసీ ఇన్ఫర్మేషన్ మిషనర్ సురేష్ చంద్ర హాజరుకానున్నారు. ఏపీ ఇన్ఫర్మేషన్ కమిషన్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్.మహబూబ్ భాషా శుక్రవారం విశాఖ చేరుకోనున్నారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించనున్నారు. ఏపీ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు చెల్లించాలి

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఒకసారి తప్పిన వారికి 2024 ఏప్రిల్‌లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతికి ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు, ఇంటర్మీడియెట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.150లు, ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు ఫీజు అక్టోబర్ 15లోగా ఫీజు చెల్లించాలన్నారు. ఇంటర్మీడియెట్ ఇంప్రూమెంట్ అవకాశం కూడా ఉందని, పూర్తి వివరాల కోసం స్టడీ సెంటర్లలో సంప్రదించాలన్నారు.

ఎంటెక్, ఎం.ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంటెక్, ఎం.ప్లానింగ్ సాయంకాలం కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. స్థానికంగా ఉద్యోగం చేస్తున్న వారికి ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంటెక్ కెమికల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్ డ్రైవర్స్ అండ్ కంట్రోల్స్, రాడార్-మైక్రోవేవ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, క్యాడ్-క్యామ్, థర్మల్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎం.ప్లానింగ్(ఎన్విరాన్‌మెంటల్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు www.audoa.in సందర్శించవచ్చు.


• సింహగిరిపై శ్రీ కృష్ణ జననోద్ధరణ



అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన బాలకృష్ణుడిని ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ కృష్ణాష్టమి(శ్రీవైష్ణవ సంప్రదాయం) ఘనంగా జరిగింది. తొలుత ఆండాళ్లమ్మ వారిని దేవకీదేవిగా అలంకరించి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం దేవకీదేవిని ఆలయ బేడా మండపంలోని పాలరాతి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. తర్వాత శ్రీకృష్ణ జననోద్ధరణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బాలకృష్ణుడికి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. తదుపరి ఆలయ ఆస్థాన మండపంలో గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారుల చెంతన బాలకృష్ణుడిని ఆశీనులను చేసి పంచామృతాలతో అభిషేకించారు. విశేషంగా హారతులిచ్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ రాజగోపురం వద్ద ఉట్టికొట్టే ఉత్సవం జరగనుంది.

• బృందావన మాలికి మహా అభిషేకం



బాలగోపాలుడికి మహాభిషేకం చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం రాత్రి 9.30 గంటలకు శ్రీకృష్ణుడికి మహా అభిషేకం నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ ఉత్సవంలో భాగంగా బాలగోపాలుడికి మృదువైన ఉయ్యాలలో సేవ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ ఉయ్యాల సేవలో భక్తులు పాల్గొని తరించారు. ముందుగా సప్తనదుల నుంచి సేకరించిన జలాలు, పళ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలు, వివిధ పుష్పాలతో స్వామిని అభిషేకించారు. అనంతరం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస భక్తులనుద్దేశించి ప్రసంగించారు.

• రుక్మిణీ వల్లభుడికి తులసీ దళార్చన



రుక్మిణీ సహిత శ్రీకృష్ణుడికి లక్ష తులసి అర్చన చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పార్వతీశ్వరాలయంలో గురువారం రుక్మిణీ సహిత శ్రీకృష్ణుడికి లక్ష తులసి అర్చన వైభవంగా జరిగింది. ఆలయానికి రుక్మిణీ సహిత శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహాలను బహూకరించిన గొలుగూరి గంగిరెడ్డి, అనిత దంపతులు భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీబాల మురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కర శర్మ శాస్త్రోక్తకంగా అర్చన జరిపించారు. సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ నమ్మి పద్మా వెంకట్, ఇప్పిలి అప్పలనాయుడు, కె.సునీతరెడ్డి, బి.టి. నాయుడు, శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, బాలమురుగన్ సేవా సమితి సభ్యుల శ్రీకృష్ణ నామంతో ఆలయం మార్మోగింది.

ఓట్ల దొంగలు పచ్చ నేతలే.!

- 'విశాఖ ఉత్తర'లో అడ్డంగా దొరికిన టీడీపీ వార్డు అధ్యక్షుడు
- 2019 ఎన్నికల్లో రెండు చోట్ల ఓటర్ల జాబితాలో బింగి రాజు
- జీవీఎంసీ 55వ వార్డులోని 27, 49 బూత్‌ల్లో ఓటు హక్కు
- జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే తరహాలో టీడీపీ ఎంట్రీలు
- వాటిని తొలగిస్తుంటే ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు



49వ బూత్‌లో బింగి రాజు పేరుతో ఓటు



రాజురెడ్డితో ఓటు నమోదు చేసుకున్న టీడీపీ నేత

సాక్షి, విశాఖపట్నం: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఆందోళన చెందిన టీడీపీ.. అడ్డదారులు తొక్కైనా సరే ఆ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న దుర్బుద్ధితో వేల కొద్దీ దొంగ ఓట్లను సృష్టించింది. ఎన్నికలకు ముందు జరిగిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సమయంలో కేవలం రెండున్నర నెలల వ్యవధిలోనే ప్రతి నియోజకవర్గంలోనూ పచ్చ కార్యకర్తల పేరుతో వేల కొత్త ఓట్లు చేర్పించింది. ఇప్పుడు జరుగుతున్న మదింపు ప్రక్రియలో టీడీపీ నేతలే అసలు దొంగలన్న నిజాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో దొంగే.. దొంగ.. దొంగా అంటూ అరిచినట్లుగా టీడీపీ నాయకులు అడ్డగోలు వ్యాఖ్యలు.. అర్థం పర్థం లేని ఫిర్యాదులు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. తాజాగా ఆ పార్టీ వార్డు అధ్యక్షుడి పేరుతో రెండు ఓట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మరోసారి ఓటమి భయంతో.. ఏం చేయాలో పాలుపోక.. అధికారులపై అడ్డగోలు ఫిర్యాదులు, ఎల్లో మీడియా అండతో పచ్చి అబద్ధాల రాతలతో రోత పుట్టిస్తున్నారు తెలుగుదేశం నేతలు. ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలోనే వలస వెళ్లిపోయిన వారు, మృతి చెందిన వారు, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తున్నారు. అయితే దీనిపై టీడీపీ నేతలు విష ప్రచారానికి తెరతీశారు. ప్రతి నియోజకవర్గంలో వేల మంది ఓట్లను తొలగించేస్తున్నారంటూ.. పచ్చ పత్రికల సహకారంతో రాద్ధాంతం చేస్తున్నారు. తొలగించిన ఓట్ల వివరాలు, ఎందుకు తొలగించాల్సి వస్తోందన్న వివరాలను సహేతుకంగా వివరిస్తూ.. ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు నివేదిక సమర్పిస్తోంది. ఓట్లు తొలగింపు సక్రమంగానే సాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సైతం స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా మదింపు ప్రక్రియలో టీడీపీ నేతల దొంగ ఓట్ల బాగోతాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి.

రెండు బూత్‌లలో ఓటు హక్కు

పాత 36వ వార్డు(ప్రస్తుత 56వ వార్డు) టీడీపీ వార్డు అధ్యక్షుడిగా వ్యవహరించిన బింగి రాజురెడ్డి తమ ఓటును రెండు చోట్ల నమోదు చేసుకున్నారు. 55వ వార్డు బూత్ నం.49లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు ఉంది. అదే వార్డులో 27వ నంబర్ బూత్‌లోనూ తన ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ఇంటి నంబర్‌తో ఒక ఓటు, తన దుకాణం చిరునామాతో మరో ఓటును 2019 ఓటర్ల జాబితాలో చేర్పించేశారు. ఒక చోట రాజురెడ్డి అని మరో చోట రాజు అని నమోదు చేసి.. నిబంధనలకు విరుద్ధంగా దొంగ ఓట్లకు తెరతీశారు. ఇటీవల జరిగిన ఇంటింటి పరిశీలనలో ఈ విషయం బట్టబయలైంది. ఈయన దొంగ ఓటు వ్యవహారంపై స్థానికులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎన్నికల్లో గెలిచేందుకు సృష్టించిన దొంగ ఓట్ల జాబితాలో ఇది కేవలం ఓ ఉదాహరణ మాత్రమే. ప్రతి నియోజకవర్గంలోనూ పచ్చ నేతలు తమకు నచ్చినట్లుగా వేల కొద్దీ దొంగ ఓట్లు నమోదు చేయించేశారు. ఇప్పుడు ఇంటింటా పరిశీలనలో ఒక్కో ఓటు తొలగిస్తుండటంతో ఏం చేయాలో తెలీక ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

సంతృప్తి సేవలే లక్ష్యంగా..

- మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం
- వారంలో రెండు రోజులు ప్రజల వద్దకే అధికారులు
- నేడు ఆనందపురం మండలంలో నిర్వహణ
- హాజరుకానున్న కలెక్టర్, విభాగాల ఉన్నతాధికారులు

సాక్షి, విశాఖపట్నం : సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్దేశిత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఇక నుంచి మండల స్థాయిలోనూ జరగనుంది. వారంలో రెండు రోజులు ప్రజల వద్దకే జిల్లా అధికార యంత్రాంగం వచ్చి, వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి ఆనందపురం మండలంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా స్థాయిలో అధికారులకు అందిస్తున్న ఫిర్యాదులతో పాటు 1902 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన వినతుల పరిష్కారం వేగవంతమైంది. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యలకు మెరుగైన పరిష్కారం దొరుకుతోంది. వైఎస్సార్ పింఛన్ కానుక, రేషన్ కార్డు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, రైతులకు సంబంధించి వచ్చిన వినతులను ట్రాకింగ్ చేస్తూ పరిష్కారమయ్యే వరకు యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. అయితే జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. అందుకే మండల స్థాయిలోనూ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా అధికారులకు ఆదేశించారు.

తొలిసారిగా ఆనందపురం మండలంలో..

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శుక్రవారం తొలిసారిగా ఆనందపురం మండలంలో నిర్వహిస్తున్నారు. జిల్లాలో గల ప్రతి మండలాన్ని కవర్ చేసే విధంగా అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రతీ బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. మండల స్థాయిలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆయా మండలాల పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

మండలాల్లో జగనన్నకు చెబుదాం షెడ్యూల్

తేదీ	కార్యక్రమం జరిగే మండలం/ప్రాంతం
సెప్టెంబర్- 08	ఆనందపురం
సెప్టెంబర్-13	ములగాడ
సెప్టెంబర్- 15	జీవీఎంసీ(సీతమ్మధార)
సెప్టెంబర్-20	గోపాలపట్నం
సెప్టెంబర్-22	విశాఖపట్నం రూరల్
సెప్టెంబర్-27	పెదగంట్యాడ
సెప్టెంబర్-29	జీవీఎంసీ(మహారాణిపేట)
అక్టోబర్-04	గాజువాక
అక్టోబర్-06	పద్మనాభం
అక్టోబర్-11	భీమునిపట్నం
అక్టోబర్-13	పెందుర్తి

కేజీహెచ్‌లో విజయవంతంగా తొడ ఎముక శస్త్రచికిత్స



కోరలయ్యతో వైద్యులు

మహారాణిపేట: కేజీహెచ్ వైద్యులు ఓ రోగి తొడ ఎముకకు శస్త్రచికిత్స చేసి ఆయన ప్రాణాలు కాపాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆర్థోపెడిక్ మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.లోకనాథ్ ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం రోగి తన పనులు తాను చేసుకుంటున్నాడు. వివరాలివీ.. హార్బర్ వద్ద జాలారిపేటలో నివసిస్తున్న కె.కోరలయ్య ఆరు నెలలుగా కుడి తొడ నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వేసుకుంటూ హార్బర్‌లో చేపలు విక్రయిస్తున్నాడు. ఇటీవల నడుచుకుంటూ వెళ్తుండగా తొడ ఎముక విరిగి రోడ్డుపై పడిపోయాడు. తర్వాత చికిత్స కోసం అనేక ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరకు నడవలేని స్థితిలో కోరలయ్య కేజీహెచ్ ఆర్థోపెడిక్ మూడో యూనిట్ ఓపీలో వైద్యులను సంప్రదించారు. ఈ యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.లోకనాథ్ ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని చికిత్స మొదలుపెట్టారు. తొడ ఎముకకు పరీక్షలు నిర్వహించిన తర్వాత క్యాన్సర్‌గా నిర్ధారించారు.

గత నెల 11న కోరలయ్యకు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గురువారం అతన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. సర్జికల్ అంకాలజీ, రేడియాలజీ, పాథాలజీ, మత్తు వైద్యులు సహకరించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



తొడ ఎముక నొప్పితో చాలా ఇబ్బంది పడ్డాను. పనిచేస్తే గానీ ఇల్లు గడిచేది కాదు. పెయిన్ కిల్లర్ మందులు వేసుకుని పనులు చేసుకునేవాడిని. ఏదో నొప్పి అనుకున్నాను గానీ.. ఇంత పెద్ద జబ్బు అని తెలియలేదు. డాక్టర్ లోకనాథ్ సహకారంతో ఈ రోజు నడవగలుగుతున్నా. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను. ఆరోగ్యశ్రీ కింద పైసా ఖర్చు లేకుండా శస్త్రచికిత్స చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్యులకు ధన్యవాదాలు.

– కె.కోరలయ్య, కూలీ, ఫిషింగ్ హార్బర్

పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ వరం



తొడ ఎముక నొప్పితో కోరలయ్య కేజీహెచ్‌లో చేరాడు. పరీక్షల్లో క్యాన్సర్ అని నిర్ధారణ అయిన తర్వాత ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నాను. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్స చేశాం. ఇప్పుడు అతను ఆరోగ్యంగా ఉన్నాడు. సొంతంగా నడవగలుగుతున్నాడు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ వరంగా మారింది.

– ప్రొఫెసర్ ఎల్.లోకనాథ్, కేజీహెచ్

నడి సంద్రంలో.. ప్రాణాలు అరచేతిలో

- సముద్రంలో చిక్కుకున్న తమిళనాడు జాలర్లు
- ఆరు రోజుల పాటు నరకయాతన
- తీరానికి సురక్షితంగా తీసుకొచ్చిన కోస్ట్‌గార్డ్స్



కోస్ట్ గార్డు అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్న తమిళనాడు మత్స్యకారులు

మహారాణిపేట: నడి సంద్రంలో తమిళనాడుకు చెందిన మత్స్యకారులు చిక్కుకుని నరకయాతన అనుభవించారు. ఆరు రోజుల పాటు తినడానికి తిండి లేక, తాగడానికి మంచి నీరు లేక అల్లాడిపోయారు. ప్రాణాలు అరచేత పట్టుకుని.. నీడలా వెంటాడిన మృత్యువుతో పోరాడారు. ఇండియన్ కోస్ట్‌గార్డు సాయంతో సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన గణపతి పెరుమాళ్ బోటు ఆగస్టు 24న కాసిమేడు నౌకాశ్రయం నుంచి చేపల వేటకు బయలుదేరింది. చెన్నైకి నార్త్ ఈస్ట్ నుంచి 240 మైళ్ల దూరంలో వేట చేస్తుండగా.. ఈ నెల ఒకటో తేదీన మరమ్మతులకు గురైంది. ఈ బోటులో వేటకు వెళ్లిన 10 మంది మత్స్యకారులు నడిసంద్రంలో చిక్కుకుని నరకయాతన అనుభవించారు. సమాచారం అందుకున్న తమిళనాడు మత్స్యశాఖ అధికారులు కోస్ట్‌గార్డ్‌ను సంప్రదించారు. దీంతో ఆయుష్ నౌక రంగంలోకి దిగింది. తమిళనాడు మత్స్యకారులను విశాఖ తీసుకొచ్చి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకు అప్పగించారు. ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్‌లో బోటు మరమ్మతులు జరుగుతున్నాయి.

తీవ్ర ఇబ్బందులు పడ్డాం

బోటు మరమ్మతులకు గురి కావడంతో నడి సంద్రంలో చిక్కుకున్నాం. ఆరు రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. నా భార్య, పిల్లలను మళ్లీ చూస్తానని అనుకోలేదు. దేవుడి దయ వల్ల తీరానికి చేరాం. మమ్మల్ని ప్రాణాలతో రక్షించిన అధికారులకు కృతజ్ఞతలు.

–ఎం.శరవణన్, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

ఆరు రోజులు.. నరకయాతన

ఎన్నో ఏళ్లుగా సముద్రంలో వేట చేస్తూ.. జీవనం సాగిస్తున్నాను. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. తినడానికి తిండి లేదు.. తాగడానికి నీరు లేదు.. కంటి నిండా కునుకు లేదు. ఎప్పుడు ఒడ్డుకు చేరుతామా అని ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఆరు రోజుల పాటు గడిపాం. ఎవరు సాయం చేస్తారా అని ఎదురుచూశాం. కోస్ట్ గార్డ్ సిబ్బందికి ధన్యవాదాలు. చాలా సంతోషంగా ఇంటికి వెళుతున్నాను.

– ఎస్.రాజు, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

ఒడ్డుకు చేరుతామన్న నమ్మకం పోయింది

సముద్రం మీద ఆధారపడి నా కుటుంబం బతుకుతోంది. గతంలో సముద్రంలో వేట చేస్తున్న సమయంలో బోటు మరమ్మతులకు గురైంది. రిపేర్ చేసి ఒడ్డుకు చేరాం. ఈ సారి కూడా బోటుకు మరమ్మతులకు చేసేందుకు ప్రయత్నించినా.. సాధ్యం కాలేదు. అలల తాకిడి ఉధృతంగా ఉంది. పరిస్థితి మా చేయి దాటిపోయింది. ఒడ్డుకు చేరుతామన్న నమ్మకం కూడా సన్నగిల్లింది. జీవితం మీద ఆశలు వదులుకున్నాం. కానీ దేవుడు దయతో ఒడ్డుకు చేరాం. మమ్మల్ని రక్షించిన అధికారుల మేలు మరువం.

–రవికుమార్, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

నేడు శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయాలు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ శనివారం లడ్డూల విక్రయాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. 750 గ్రాములు ఉన్న కల్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాములు బరువు ఉన్న లడ్డూ రూ.50 విక్రయిస్తామని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

విశాఖ విద్య: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువులు సాగించి భవిష్యత్‌కు పటిష్టమైన బాటలు వేసుకోవాలని విద్యాశాఖ శిక్షణ విభాగం రాష్ట్ర డైరెక్టర్ మస్తానయ్య అన్నారు. గురువారం విశాఖ జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ వినియోగం ఎలా ఉందనేది తెలుసుకున్నారు. ఐఎఫ్‌పీ ఎలా ఉపయోగపడుతుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొస్తుందన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై పాఠ్యాంశాల బోధన వల్ల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే అవకాశం ఉంటుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇమంది పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



తెరిపిచ్చిన వర్షం

దొండపర్తి: నగరంలో వర్షం తెరిపిచ్చింది. 24 గంటల తర్వాత ఎండ దర్శనమిచ్చింది. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. ప్రధానంగా పెందుర్తి, ఎన్‌ఏడీ, మురళీనగర్, మద్దిలపాలెం, భీమిలి, గాజువాక ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం మేఘాలు కమ్ముకునే అవకాశాలు ఉన్నప్పటికీ.. వర్షం కురిసే అవకాశాలు తక్కువే అని వాతావరణ శాఖ నిపుణులు చెప్పారు.


ఎగిసి పడుతున్న అలలు

కళా ఉత్సవం అదిరెన్

- కేవీ-2లో ప్రారంభమైన రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలు
- 72 కేవీల నుంచి 400 మంది బాలబాలికలు హాజరు


అబ్బురపరిచిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థినుల ప్రదర్శన


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఐఎన్‌ఎస్ శాతవాహన కమాండ్ అధికారి కమొడోర్ రజత్

కంచరపాలెం: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కేవీ సంఘటన్-ఎన్‌సీఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయం-2 శ్రీవిజయనగర్‌లో రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవ్ గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఐఎన్ఎస్ శాతవాహన కమాండ్ అధికారి, విద్యాలయ చైర్మన్ కమోడోర్ రజత్ నాగ్‌పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల.. వారి భవిష్యత్‌కు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 8 క్లస్టర్లలోని 72 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 400 మంది బాలబాలికలు ఈ ఉత్సవ్‌లో పాల్గొన్నారు. నృత్యం, సంగీతం, డ్రామా, విజువల్ ఆర్ట్, బొమ్మల తయారీ వంటి రంగాల్లో పోటీ పడుతున్నారు. ఈ పోటీల్లో విజేతలు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్, కళా ఉత్సవాల్లో పాల్గొంటారని కేవీ-2 ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. విద్యావేత్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉపమాక ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


యశోద అలంకరణలో గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి: ఉపమాకలోని గరుడాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని యశోదాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు భాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో యశోదాదేవి ఒడిలో శ్రీకృష్ణ పరమాత్మ ఉగ్గుపాలు తాగే ఘట్టం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గోపూజ ఉత్సవం జరిపారు. అనంతరం ఆలయంలో గల అలంకరణ మూర్తులు, ఉత్సవ మూర్తులకు ధూపహారతి, చంద్రహారతి, గరుడ హారతి, నక్షత్ర హారతి, వనమాల హారతి, గజహారతి, కుంభ హారతి, పేట హారతులతో ప్రత్యేకంగా హారతి సమర్పణ నిర్వహించారు. వెన్న, పాలు, పెరుగు తదితర విశేష నివేదనలు సమర్పించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయం సందర్శన

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయాన్ని గురువారం పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సందర్శించారు. ముందుగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బి.ఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్యాలయ ఇన్‌చార్జి జి.రవిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఐహెచ్ ఫరూఖీ, జోనల్ ఇన్‌చార్జి బర్కత్ అలీ, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు అద్దాల కృపాజ్యోతి, కె.వి.బాబా, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కె.గోవిందరావు, సీహెచ్ సూరిబాబు, డాక్టర్ ఎస్‌కే కాసిం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

రక్తహీనత నివారణకు సంపూర్ణ పోషకాహారం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, ఇతర పథకాలు, జగనన్నకు చెబుదాం వంటి అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. అర్జీలు పరిష్కరించిన తర్వాత ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం సరఫరాకు తీసుకున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాఖ విద్య: జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేట రామాలయం పక్కన ఓ యువకుడు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లా నితిన్(20) గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన తల్లి ఇంటి తలుపులు తీయగా, కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండటాన్ని చూసి, విషయాన్ని బంధువులకు తెలిపింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శివప్రసాద్ (ఫైల్)

ఆరిలోవ: వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 13వ వార్డు పరిధి జై భీమ్ నగర్‌కు చెందిన పి.శివప్రసాద్(25), అతని స్నేహితుడు మణికంఠ కలిసి బుధవారం రాత్రి పెందుర్తిలో వివాహ వేడుకకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పెందుర్తి నుంచి తిరిగి అర్ధ రాత్రి దాటిన తర్వాత బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆరిలోవ బయలుదేరి వస్తున్నారు. రాత్రి 12.30 గంటల సమయంలో ముడసర్లోవ దరి స్కిల్ డెవలప్‌మెంట్ కూడలి వద్ద హనుమంతవాక నుంచి వస్తున్న ఇసుక లారీ ఆరిలోవ కాలనీవైపు మలుపు తిరుగుతుండగా... అదే సమయంలో ఎదురుగా వస్తున్న శివప్రసాద్ నడుపుతున్న బైక్ లారీని ఢీకొంది. దీంతో లారీ టైర్ కిందకు బైక్‌తోపాటు శివప్రసాద్ వెళ్లిపోయాడు. లారీకి ఉన్న ఇనుప రాడ్లు తగిలి శివప్రసాద్ తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. బైక్ వెనుక కూర్చొన్న మణికంఠ తల, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. శివ ప్రసాద్ ఆరిలోవ దుర్గానగర్ వద్ద సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకొన్న మృతుని అక్క డి.వనజ, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయాలపాలైన మణికంఠ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

కౌన్సెలింగ్, బదిలీలు మళ్లీ వాయిదా

మహారాణిపేట : ఇటీవల జరిగిన మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఎంపీహెచ్ఈవో) బదిలీలు, కౌన్సెలింగ్ వాయిదా పడింది. 18 మందికి గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ 18 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించాలని అధికారులు గురువారం కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పీహెచ్‌సీల్లో మాత్రమే నియమిస్తామని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ అశ్వనీదత్ స్పష్టం చేశారు. దీంతో ఇప్పుడు కౌన్సెలింగ్ వద్దని, బుధవారం నిర్వహించాలని ఏంపీహెచ్ఈవోలు కోరారు. ఈ ప్రతిపాదనల వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి దృష్టిలో పెడతామని చెప్పి కౌన్సెలింగ్ వాయిదా వేశారు.

'జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఉద్యమిద్దాం'

దాబాగార్డెన్స్: ఇళ్ల స్థలాల సాధనకు అంతా కలసికట్టుగా ఉద్యమిద్దామని విశాఖ జర్నలిస్టులు పిలుపునిచ్చారు. జీవీఎంసీ సెల్లార్‌లో పలువురు సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఆర్.రామచంద్రరావు, బి.రవికాంత్, పి.రామకృష్ణ, పి.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేశాయన్నారు. ఇప్పుడు అర్హులైన జర్నలిస్టుందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరికి 2 నుంచి 3 సెంట్లు స్థలం వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించి అధికారుల దృష్టికి తీసుకెళదామన్నారు. త్వరలో నూతన సొసైటీ ఏర్పాటు చేసి దీనికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణ రూపొందిద్దామని, అంతా సహకరించాలని కోరారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు

మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం

సీతంపేట: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అడ్‌హక్ కమిటీ ఎన్నిక జరిగిందని, రాష్ట్ర కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తి ఎన్నికైనట్టు కేంద్ర కమిటీ కన్వీనర్ ఆర్ఎస్‌వీ మురళీ తెలిపారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందన్నారు. 1972లో ఏర్పడ్డ సమాజం, 50 ఏళ్లకు పైగా మానవ హక్కులు కోసం, అంటరానితనం నిర్మూలనకు, స్త్రీవివక్షతకు వ్యతిరేకంగా, కుల, మత,మూఢ విశ్వాసాల నిర్మూలనకు, దేవుడి పేరుతో జరిగే దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. చంద్రయాన్ పేరుతో ఒకవైపు జాబిలి పైకి రాకెట్లను పంపిస్తున్న తరుణంలో అదే రాకెట్ నమూనాను తీసుకువెళ్లి తిరుపతి, చంగాలమ్మ ఆలయాల్లో పూజలు చెయ్యడం ప్రజలను మధ్యయుగాల నాటి ఆచార సంప్రదాయాలవైపు తీసుకువెళ్లడమే అన్నారు. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఏడుగురు సభ్యులతో రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తి, సభ్యులుగా జె.శ్యామల, వీరబాబు, కె.విజయ్‌కుమార్, మధుసూదన్, జి. వికాస్, శ్రీరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, చార్వాక, రషీద్ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

- పనులు ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్
- రూ.13 కోట్లతో ఆలయ ఆధునికీకరణ


అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం శ్రీకారం చుట్టారు. ఏపీ అర్చక సంఘం ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో పనుల ప్రారంభ సూచనగా కలశ పూజ, గోపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం బాలాలయంలో తాత్కాలికంగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, హిమగౌరి దంపతులు బాలాలయంలో అమ్మవారికి తొలి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి 8 దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల భక్తులు పెద్దఎత్తున నూకాంబిక అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆలయ గర్భాలయాన్ని విస్తరించడంతోపాటు, ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు సమకూర్చిందని, టీటీడీ దేవస్థానం నుంచి రూ.3 కోట్లను అప్పటి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మంజూరు చేశారని, తొలివిడతగా రూ.కోటి 50 వేల నిధులు విడుదల చేశారన్నారు. అమ్మవారి ప్రధాన గర్భాలయాన్ని మూసివేసి, కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో భక్తుల దర్శనార్థం అమ్మ వారి ప్రతిమను ప్రతిష్ఠించినట్లు చెప్పారు. ఇక్కడి నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ మంత్రి దంపతులకు పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



● ఎగిరే పావురమా..

ఆర్కే బీచ్‌లో పావురాలు సందడి చేస్తున్నాయి. అక్కడికొచ్చిన సందర్శకులు పావురాలకు గింజలు వేస్తుండటంతో ఇలా పెద్ద సంఖ్యలో వచ్చి కనువిందు చేస్తున్నాయి.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం